నిజామాబాద్
గురువారం 26 అక్టోబర్ 2023



- కాంగ్రెస్ నాటి రూ.200తో పోల్చితే పది రెట్లు ఎక్కువ
- ఏడాదిలోగా రూ.3016కు పింఛన్
- వచ్చే ఐదేండ్ల వరకు రూ.5016కు పెంపు
- నాడు వేళ్ల మీద లెక్క పెట్టేంత మందికి .. నేడు వేలాది మందికి..

# మరింత ఆసరా..

## పదేండ్లలో పదింతలు పెరిగిన పింఛన్లు



**దేశంలో ఎక్కడా** లేనివిధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ మాత్రమే రూ.2016 ఆసరా పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల వేళ తెలంగాణలో రూ.4వేల ఆసరా పింఛన్ ఇస్తామని హామీ ఇస్తున్న విపక్ష పార్టీలు.. వారు ప్రస్తుతం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కేసీఆర్ ఇస్తున్న రూ.2016 పింఛన్‌లో సగం కూడా ఇవ్వడం లేదు. ఆ విపక్షాల్లో ఓ విపక్షం గతంలో ఇక్కడ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చింది గుప్పెడంత మందికి గురిజంత మాత్రమే. అప్పుడు ఇక్కడ ఇవ్వని పార్టీ..ఇప్పుడు వారు అధికారంలో ఉన్నచోట కూడా అరకొర పింఛన్ మాత్రమే ఇస్తున్నారు. ఇప్పుడు తెలంగాణలో రూ.4వేలు ఇస్తామంటే ఎవరు నమ్మాలి..ఎలా నమ్మాలి అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

-కమ్మర్‌పల్లి, అక్టోబర్ 25



### 2 వందల కెల్లి.. 2వేలు జేసినాయనే ఇస్తడు

ఇప్పుడు మల్ల గా పాతోల్లే వచ్చి 4వేలు ఇత్త మంటున్నరు. మునుపట్ల గాల్లున్నప్పుడు 2వందలే ఇచ్చిండ్రు. మల్లచ్చి 4వేలు అనంగనే నమ్ముతమా. గాల్లు ఇచ్చే 2వందలను 2 వేలు జేసిండు కేసీఆర్ సారు. గాయననే మల్ల 3వేలు జేసి మెల్లగా 5 వేలు ఇస్తమంటున్నడు. గాయనతోనే ఇచ్చుడవుతది.

**-లక్ష్మి, ఆసరా లబ్ధిదారు, వేల్పూర్**

### ఓళ్లు కాలం జేత్తరో అని సూసుడుంటుండే..

గప్పట్ల రూ.200 పింఛన్ అచ్చేటప్పుడు ఊళ్లే ఓళ్లు కాలం జేత్తరా..గాళ్ల జాగాల పింఛన్ అత్తది అని ముసలోళ్లు ఎదురు సూసే పడువడ్డ రోజులుంటుండే. నూట్లె పది మందికి అత్తుండె.. తొంభై మందికి రాకపోతుండే. కేసీఆర్ సార్ అచ్చినంక నూట్లె తొంభై మందికి అత్తున్నయ్. పది మందికి రాకపోతె మెల్లగా అల్లకు సుక ఇత్తా వోతున్నరు. గిసుంటి మంచోళ్లను గాదని ఓట్లు రాంగనే ఆగమాగం అవుతమా.

**-భూదేవి, ఆసరా లబ్ధిదారు, వేల్పూర్**




### ఐదేండ్ల వరకు ఐదు వేలకు పెరుగుతది

ఇప్పుడు ఇస్తున్న రూ.2016 పింఛను ఈ యాడాది లోపల్నే రూ.3వేలకు పెంచడమే కాకుండా ఐదేండ్ల లోపు రూ.5 వేలకు పెరుగుతది. అన్ని వర్గాల సంక్షేమాన్ని ముందుకు తీసుకపోయే క్రమంలో ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకొని కేసీఆర్ ఇచ్చిన ఈ హామీ ఆమోదయోగ్యంగా ఉన్నది. ఆచరణ సాధ్యంగా కూడా ఉన్నది.

**-రాజు, ఆసరా పింఛన్ లబ్ధిదారుడు, వేల్పూర్**





### ఇచ్చినోళ్ల మీదనే నమ్మకం..

కేసీఆర్ వెయ్యి రూపాల పింఛన్ ఇస్తన్నడు ఇచ్చిండు. మల్ల వచ్చి వెయ్యి రూపాలు పెంచుత అన్నడు పెంచిండు. ఇప్పుడు మళ్ల వెయ్యి పెంచి ఇస్తంటున్నడు ఇస్తడు సుక. గిట్ల పింఛన్ మీద మాకు ఇప్పటి దాక ఇచ్చినోళ్ల మీదనే నమ్మకమున్నది.

**- తోపారం గంగాధర్, ఆసరా పింఛన్ లబ్ధిదారుడు, వేల్పూర్**

**మ్యానిఫెస్టోలో కేసీఆర్ హామీపై ఆసరా లబ్ధిదారుల హర్షం**



**కష్టకాలంల ఆదుకునే మనిషిని కాదనుకుంటమా..**

కేసీఆర్ సారు కష్టకాలంల ఆదుకునే మనిషి. ఎవరికి ఎప్పుడు ముందుగల్ల ఏది గావాలా..ఎంత గావాలా అని ఆలోచించి కష్టం దూరమయ్యే సహాయం అందిస్తడు. గందుకే ముందుగల్ల ముసలోల్ల పింఛన్ 2వందల కెల్లి వెయ్యికి..వెయ్యికెల్లి 2 వేలకు పెంచిండు. కేసీఆర్ సార్ పింఛన్ పైసలను ఓట్ల కోసం పెంచలేదు. నాలుగు పైసలు పెంచి ఇస్తే ముసలోల్లకు, ముడిగోల్లకు ఆసరా అవుదని వెంచిండు. గది మా మనసుకు ఎరుక.

**-పెంటయ్య గౌడ్, ఆసరా పింఛన్ లబ్ధిదారుడు, వేల్పూర్**

**గతంలో** రూ.200 మాత్రమే ఉన్న పింఛన్‌ను ఏకంగా రూ.1016కు పెంచి, అటు తర్వాత రూ.2016కు పెంచి అందిస్తూ వచ్చిన కేసీఆర్. ఇప్పుడు ఏడాదిలో రూ.3016కు పెంచి అటు తర్వాత ఐదేండ్లలో రూ.5016 వరకు ఆసరా పింఛన్‌ను పెంచుతామని మ్యానిఫెస్టోలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీనే నమ్ముతామనే మాటలు లబ్ధిదారుల్లో వినిపిస్తున్నాయి. విపక్షాల పాలన సమయంలో వందల మందికి మాత్రమే వచ్చే పింఛన్ కేసీఆర్ వచ్చాక వేల మందికి వస్తున్న విషయాన్ని లబ్ధిదారులు గుర్తు చేస్తున్నారు. ఉమ్మడి పాలకుల హయాంలో మొదట రూ.70 పింఛన్ సమయంలో చిటికెడు మందికి, రూ.200 పింఛన్ సమయంలో పిడికెడు మందికి వచ్చే పరిస్థితి ఉండేది. పింఛన్ కోసం ఎదురు చూసే వారు గ్రామంలో ఎవరైనా వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు చనిపోతే ఆ స్థానంలో తమకు పింఛన్ వస్తుందని ఎదురుచూసే దౌర్భాగ్యం ఉండేది. కానీ కేసీఆర్ వచ్చిన తర్వాత వేల మందికి పింఛన్ వస్తున్నదనే చర్చ జరుగుతున్నది. నిజామాబాద్ జిల్లాలో ఉమ్మడి పాలకుల హయాంలో రూ.70 చొప్పున, రూ.200 చొప్పున కొద్దిమందికి మాత్రమే పింఛన్ వస్తే నేడు 2లక్షల79 వేల మందికి పింఛన్ వస్తుండడం లబ్ధిదారు ల్లో కేసీఆర్ మ్యానిఫెస్టో హామీపై విశ్వాసం పెంచుతున్నది.

**నిజామాబాద్ జిల్లాలో పింఛన్ల వివరాలు..**

| పథకం | లబ్ధిదారుల సంఖ్య | నెలనెలా వెచ్చిస్తున్న మొత్తం (రూ.లలో) |
|---|---|---|
| వృద్ధాప్య | 53,231 | 10.73 కోట్లు |
| దివ్యాంగులు | 19,152 | 5.78 కోట్లు |
| వితంతు | 70,198 | 14.15 కోట్లు |
| చేనేత | 201 | 4లక్షలు |
| గీత | 1,047 | 21లక్షలు |
| ఒంటరి మహిళ | 9,993 | 2.01 కోట్లు |
| బీడీ కార్మికులు | 96,131 | 19.38కోట్లు |
| ఎయిడ్స్‌బాధితులు | 1,559 | 0.32లక్షలు |
| బోధకాలు | 398 | 0.08లక్షలు |
| మొత్తం | 2,51,910 | 52.70 కోట్లు |

**కామారెడ్డి జిల్లాలో పింఛన్ల వివరాలు..**

| పథకం | లబ్ధిదారుల సంఖ్య | నెలనెలా వెచ్చిస్తున్న మొత్తం (రూ.లలో) |
|---|---|---|
| వృద్ధాప్య | 42,795 | 8.62 కోట్లు |
| వితంతు | 48,511 | 9.77 కోట్లు |
| దివ్యాంగులు | 18,195 | 5.48 కోట్లు |
| చేనేత | 632 | 12.74 లక్షలు |
| గీత | 708 | 14.27 లక్షలు |
| బీడీ కార్మికులు | 36,934 | 7.44 కోట్లు |
| ఎయిడ్స్ బాధితులు | 1,164 | 23.47 లక్షలు |
| బోధకాలు బాధితులు | 524 | 10.56 లక్షలు |
| ఒంటరి మహిళలు | 4,416 | 89.03 లక్షలు |
| మొత్తం | 1,53,879 | 32.84 కోట్లు |



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారి వేషధారణలో..



కోటగల్లీలో పులి వేషధారణలో కళాకారుల విన్యాసం



ఒగ్గు కళాకారుల ప్రదర్శన

# అమ్మ తరలే... భక్తులు తరించే

**ఘనంగా దుర్గామాత నిమజ్జనోత్సవం**

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 25: శరన్నవరాత్రులను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 15న కొలువుదీరిన దుర్గామాత ప్రతిమలను బుధవారం నిమజ్జనం చేశారు. విశేష పూజలందుకున్న అమ్మవారిని ప్రత్యేక వాహనాల్లో అలంకరించి డీజే చప్పుళ్లు, బ్యాండు మేళాలతో శోభాయాత్ర నిర్వహించారు. కోటగల్లీ మార్కండేయ మందిరం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర, గాయత్రీనగర్, వర్ని చౌరస్తా, ఖిల్లా, అర్సపల్లి, జాన్కంపేట మీదుగా బాసర గోదావరి వరకు నిర్వహించారు. అనంతరం గోదావరి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దుర్గామాత ప్రతిమలను నిమజ్జనం చేశారు.





శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు, కళాకారిణి విన్యాసం



భక్తులను ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన సెట్టింగ్..



దేవీమాత వేషధారణలో కళాకారులు



దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



గిరిజన వేషధారణలో కళాకారులు